# News Item  in Various Daily News Papers on 15-02-2018.

In Namaste Telangana :

# 52 ఆర్వోబీలకు ఆమోదం



బుధవారం జలసౌధలో రాష్ట్రంలో ని రైల్వే పెండింగ్ ప్రాజెక్టులపై మంత్రి హరీశ్‌రావు అధ్యక్షతన అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, మహేందర్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కూడా ఉన్నారు.

- రూ. 2,700 కోట్ల అంచనా వ్యయం
- రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 460 ఆర్వోబీలకు ప్రతిపాదనలు
- అంచెలంచెలుగా రైల్వే క్రాసింగ్‌ల ఎత్తివేత
- ఆర్వోబీల నిర్మాణ బాధ్యత ఆర్‌అండ్‌బీ దే
- రైల్వేను ఒప్పించిన మంత్రి తుమ్మల
- రాష్ట్రంలో రైల్వే పెండింగ్ ప్రాజెక్టులపై మంత్రి హరీశ్‌రావు అధ్యక్షతన అధికారులతో మంత్రుల సమీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలోని 460 రైల్వే లెవల్ క్రాసింగ్‌లను అంచెలంచెలుగా ఎత్తి వేసేందుకు సమగ్ర ప్రతిపాదనలు ప్రభుత్వం సిద్ధంచేస్తున్నది. తొలివిడుతగా 2018లో 52 ఆర్వోబీలను నిర్మించేందుకు రూ.2,700 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలను ఆమోదించింది. వీటికయ్యే వ్యయాన్ని రైల్వే శాఖ, రాష్ట్ర ప్రభుత్వం సమానంగా భరించనున్నాయి. ప్రధానంగా ఆర్వోబీల నిర్మాణాలను రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ ఆధ్వర్యంలో చేపట్టేందుకు రైల్వేశాఖను మంత్రులు ఒప్పించారు. ఇకనుంచి రాష్ట్ర పరిధిలోని ఆర్వోబీల నిర్మాణాలు పూర్తిగా ఆర్‌అండ్‌బీ శాఖ చూసుకుంటుంది. బుధవారం హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని జలసౌధలో రాష్ట్రంలోని రైల్వే పెండింగ్ ప్రాజెక్టులపై మంత్రి హరీశ్‌రావు అధ్యక్షతన అధికారులతో మంత్రులు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్‌శర్మ, దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్, ఆర్‌అండ్‌బీ, రైల్వే శాఖలకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

**ప్రమాదాల నివారణకు పెద్దపీట**

ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చెప్పారు. ఇందులోభాగంగా ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నదని అన్నారు. రైల్వే క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ అంతరాయాలు తగ్గించేందుకు కృత నిశ్చయంతో ఉన్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రమాదాలను పూర్తిస్థాయిలో నిరోధించేందుకు పలు రకాల చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలో 16 ఆర్వోబీల స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**సమావేశం నుంచే కలెక్టర్లతో మాట్లాడిన మంత్రి తుమ్మల**

రైల్వే ప్రాజెక్టులతోపాటు, ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణాల కోసం భూ సేకరణ సమస్యగా మారిందని రైల్వే అధికారులు తెలుపడంతో ఆర్‌అండ్‌బీశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పలు జిల్లాల కలెక్టర్లతో సమావేశం నుంచే మాట్లాడారు. భూ సేకరణ పనులు పూర్తి చేసి సంబంధిత స్థలాలను అప్పగించినట్లైతే ఆర్వోబీలు త్వరగా పూర్తవుతాయని వారికి మంత్రి చెప్పారు. సంగారెడ్డి, మెదక్, భద్రాద్రి, ఖమ్మం, వరంగల్ (రూరల్), సూర్యాపేట కలెక్టర్లతో మాట్లాడటంతో త్వరలోనే భూ సేకరణ సమస్య కొలిక్కివచ్చే అవకాశాలున్నాయని చెప్పారు.

## సుబాబుల్ రైతులను ఆదుకుంటాం: మంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో సుబాబుల్ రైతులు పడుతున్న కష్టాలను తీర్చి కనీస మద్దతు ధర వచ్చేలా కృషిచేస్తామని నీటిపారుదల, మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారు. బుధవారం ఎర్రమంజిల్‌లోని జలసౌధలో సుబాబుల్ రైతులతో హరీశ్‌రావు సమావేశమయ్యారు. ఐటీసీ నియమించిన ఏజెంట్లను, దళారులను తొలిగిస్తే కంపెనీ అందించే రూ.4,508 మద్దతు ధర రైతులకు అందుతుందని అన్నారు. మండలానికో డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తామని మంత్రి చెప్పారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌లాల్, సుబాబుల్ రైతులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ Thu, 15 February 2018
epaper.ntnews.com//c/26271281

In Sakshi :



బుధవారం జరిగిన సమీక్షలో దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్‌తో మంత్రులు హరీశ్ రావు, తుమ్మల నాగేశ్వర్‌రావు

# లెవెల్ క్రాసింగ్‌ల వద్ద వంతెనల నిర్మాణం

- రైల్వే జీఎంతో భేటీలో తుమ్మల, హరీశ్, మహేందర్‌రెడ్డి నిర్ణయం
- ఈ సంవత్సరం 52.. దశలవారీగా 460 సిద్ధం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉన్న 460 రైల్వే లెవెల్ క్రాసింగుల వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబీ)లను నిర్మించాలని రాష్ట్ర రోడ్లు-భవనాలు, రైల్వే శాఖలు నిర్ణయించాయి. ఈ ఏడాది 52 ఆర్వోబీలను నిర్మించాలని ప్రతిపాదించాయి. వీటికి అయ్యే రూ.2,700 కోట్ల ఖర్చును రెండు శాఖలు చెరి సగం భరించనున్నాయి. బుధవారం ఇక్కడ రోడ్లు, భవనాల మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, నీటిపారుదల మంత్రి హరీశ్‌రావు, రవాణా మంత్రి మహేందర్‌రెడ్డి దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్‌తో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో నాలుగు వరుసల రోడ్ల నిర్మాణం ముమ్మరంగా సాగుతున్నందున ఆర్వోబీలు కూడా నాలుగు వరుసలుగా ఉండేవిధంగా చూడాలని మంత్రులు కోరగా రైల్వే జీఎం అంగీకరించారు. గతంలో నాలుగు వరుసల రోడ్లపై రెండు వరుసల ఆర్‌వోబీలనే నిర్మించారు. వంతెనల్లో పట్టాల మీదుగా నిర్మించే భాగాన్ని ఇప్పటిదాకా రైల్వే శాఖ చేపడుతోంది. ఇక్కడ సమన్వయలోపం కారణంగా ఆ పనులు పెండింగ్‌లో ఉండటంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఇక నుంచి ఆ భాగాన్ని రాష్ట్రప్రభుత్వం చేపట్టాలని నిర్ణయించారు. రైల్వేవాటా నిధులు రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తే పనులను రాష్ట్ర యంత్రాంగమే చేపడుతుంది. పాత ఆర్‌వోబీలను తొలగించి కొత్తవాటిని నిర్మించేందుకు రైల్వే జీఎం అంగీకరించారు. మియాపూర్- పటాన్‌చెరు మధ్య రైల్వే టెర్మినల్ నిర్మించాలని ప్రతిపాదిస్తున్నట్టు తుమ్మల తెలిపారు. మెదక్- అక్కంపల్లి రైల్వే లైన్ నిర్మాణం ఈ సంవత్సరాంతానికి పూర్తి అవుతుందని హరీశ్ ప్రకటించారు.

సాక్షి SAKSHI TELUGU DAILY Thu, 15 February 2018
epaper.sakshi.com//c/26272291